

కైకరం హాస్టల్‌లో డిఎల్‌డిఎ రాత్రి నిద్ర

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని కైకరం బాలుర వసతి గృహాన్ని మండల ప్రత్యేక అధికారి, డిఎల్‌డిఎ రమణ శుక్రవారం రాత్రి సందర్శించారు. వసతి గృహంలో 48 మంది విద్యార్థులుండగా వారికి భోజనం, కాస్మోటిక్ వసతులు ఏ విధంగా అందుతున్నాయో ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. రాత్రి అక్కడే బస చేశారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు వసతిగృహాన్ని తనిఖీ చేసినట్లు డిఎల్‌డిఎ రమణ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర ఆయన వెంట ఉన్నారు.

ముసునూరు : మండలకేంద్రమైన ముసునూరు బాలుర బిసి హాస్టల్‌ను నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ శుక్రవారం రాత్రి చేశారు. హాస్టల్ గదులను, భోజనశాల, మరుగుదొడ్లు పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. అధ్వాన్నంగా ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులను సమస్యలు అడిగితెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం సరిగా ఉండటం లేదని, కోడి గుడ్డు ఉడకటం లేదని ఆయనకు వివరించారు. గదులకు కిటికీలు, తలుపులు, ఫ్యాన్లు సరిగా లేవని వివరించారు.

ఖరీఫ్ నాట్లు ఆలస్యం..!

- రెండు జిల్లాల్లో 3 లక్షల ఎకరాలకుపైగా వరిసాగు
- ఇప్పటికీ ఐదుశాతం పూర్తి కాని నాట్లు
- నీటి ఎద్దడి సమస్యతో రైతుల అవస్థలు
- వర్షాల రాకతో గోదావరి నుంచి నీటి విడుదల పెంపు
- ఆగస్టులోనూ నాట్లు సాగే పరిస్థితి
- కౌలురైతులకు రుణాల మంజూరులో నిర్లక్ష్యమే



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్‌లో ముందస్తు సాగు ప్రణాళికలు విఫలమయ్యాయి. జులైలో సగం రోజులు గడిచినా ఇప్పటికే ఐదు శాతం నాట్లు కూడా పూర్తికాని పరిస్థితి నెలకొంది. ఆగస్టు వరకూ నాట్లు పూర్తయ్యే పరిస్థితి లేదని అధికారులే చెబుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో 2.13 లక్షల ఎకరాలు, ఏలూరు జిల్లాలో లక్షా 15 వేల ఎకరాలు మొత్తం 3.30 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఇప్పటి వరకూ కేవలం పది వేల ఎకరాల్లో మాత్రమే ఐదు శాతం కూడా నాట్లు పూర్తికాని పరిస్థితి నెలకొంది. ఏలూరు జిల్లాలోనూ దాదాపు అదే పరిస్థితి ఉంది. దీంతో ఖరీఫ్ నాట్లు మరింత ఆలస్యమయ్యే పరిస్థితి ఏర్పడింది. జూన్ ఒకటో తేదీన కాలువలకు సాగునీరు విడుదల చేసి ముందస్తు సాగుకు ప్రభుత్వం ప్రణాళికలు రచించింది. వేసవి వేడిగాలులు తగ్గకపోవడంతో రైతులు నారుమడులు వేసేందుకు వెనుకంజ వేశారు. నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా రావడంతో నారుమడులు మరింత ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం నారు చేతికొచ్చినా నీటిఎద్దడి సమస్యతో నాట్లు ముందుకు సాగని దుస్థితి నెలకొంది. వర్షాలు కురవకపోవడంతో సాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి రోజుకు మూడు వేల క్యూసెక్కుల నీరు సైతం వదలని పరిస్థితి ఏర్పడింది. గోదావరి జలాలు లేకపోవడంతో సీలేరు నుంచి వస్తున్న నీటినే వదిలారు. దీంతో దుక్కులకు నీరు చాలక నాట్లు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. దీంతో నాట్లు సకాలంలో పడని దుస్థితి ఏర్పడింది. గడచిన రెండు రోజులుగా జిల్లాలో వర్షాలు కురవడం, గోదావరి నీటిప్రవాహం పెరగడంతో రైతులకు కొంత ఊరట లభించింది. ప్రస్తుతం రోజుకు ఏడు వేల క్యూసెక్కుల నీటిని గోదావరి నుంచి విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. సాగునీరు పూర్తిస్థాయిలో వస్తుండటంతో దమ్ములకు ఇబ్బంది తొలగనుంది. దీంతో నాట్లు ఊపందుకునే పరిస్థితి ఉంది. ఏదేమైనా అధికారుల లెక్కల ప్రకారం ఆగస్టు రెండోవారం వరకూ ఖరీఫ్ నాట్లు కొనసాగే పరిస్థితి ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఖరీఫ్ నాట్లు ఆలస్యంతో ఈ ప్రభావం రబీ సాగుపైనా పడనుంది. నాట్లు ఆలస్యం అవుతుండటంతో ఖరీఫ్ మాసూళ్లు సైతం నవంబర్, డిసెంబర్‌లో రానున్నాయి. పంట తుపాన్ల బారిన పడే ప్రమాదం ఉందని రైతులు లోలోన ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఖరీఫ్ నాట్లు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులు రైతులను సమాయత్తం చేయాల్సి ఉంది.

కౌలురైతుల పట్ల కొనసాగుతున్న నిర్లక్ష్యం

రెండు జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు ఉన్నారు. జిల్లా వ్యవసాయ సాగులో వీరిదే కీలకపాత్ర. ప్రభుత్వం మాత్రం కౌలురైతుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ప్రతియేటా మాదిరిగానే ఈ ఏడాదీ కౌలుకార్డుల జారీలోనూ, రుణాల మంజూరులోనూ నిర్లక్ష్యమే కొనసాగుతోంది. ఏలూరు జిల్లాలో 48 వేల వరకూ కౌలుకార్డులు ఇవ్వాలని టార్గెట్‌గా పెట్టుకుని ఇప్పటి వరకూ 38 వేలు ఇచ్చినట్లు తెలుస్తోంది. పశ్చిమగోదావరి జిల్లాలోనూ దాదాపు ఇదే పరిస్థితి ఉంది. కౌలురైతులకు బ్యాంకు రుణాల మంజూరు గురించి ఏ ఒక్క అధికారి నోరు మెదపడం లేదు. 2022లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో బ్యాంకుల నుంచి పంట రుణాలు అందుకున్న రైతులు అతి తక్కువ మంది ఉన్నారు. ఈ ఏడాది కూడా కౌలురైతులకు అన్యాయం చేసే పరిస్థితులు కన్పిస్తున్నాయి. త్వరితగతిన కౌలుకార్డుల జారీ ప్రక్రియ పూర్తి చేసి, కౌలురైతులకు పంట రుణాలు అందిస్తేనే అన్నదాతలకు మేలు జరుగుతుంది. లేనిపక్షంలో ప్రయివేటు వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల్లో కౌలురైతులు చిక్కుకుపోనున్నారు.

పద్మ పురస్కారాలకు ఎంట్రీల ఆహ్వానం

ప్రజాశక్తి - ఏలూరు


భారత ప్రభుత్వం అందించే 'పద్మ' పురస్కారాలకు జిల్లాలో అర్హులైన వారి వివరాలు ఆగస్టు పదో తేదీలోగా పంపించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో శుక్రవారం 'పద్మ' పురస్కారాలపై అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి లావణ్యవేణి మాట్లాడుతూ కళలు, భాషా సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సమాజ సేవ, శాస్త్ర సాంకేతికత, ప్రజా వ్యవహారాలు, పౌర సేవలు, పరిశ్రమలు తదితర రంగాల్లో నిష్ణాతులు, విశిష్ట సేవలందించిన వారికి భారత ప్రభుత్వం ప్రతియేటా గణతంత్ర దినోత్సవం సందర్భంగా 'పద్మ' పురస్కారాలను అందిస్తుందన్నారు. జిల్లాలో 'పద్మ' పురస్కారాలకు అర్హులను గుర్తించి వారి వివరాలు ఆన్‌లైన్ ద్వారా ఆగస్టు 10వ తేదీలోగా అందించాలన్నారు. ఆయా రంగాల్లో నిష్ణాతులు, సమాజ సేవ చేసిన వారు కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సమావేశంలో నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ట్రైనీ కలెక్టర్ అపూర్వ భరత్, డిఆర్‌ఒ ఎవిఎన్ఎస్.మూర్తి, డిఆర్‌డిఎ పిడి విజయరాజు, డిఇఒ రవిసాగర్, బిసి కార్పొరేషన్ ఇడి ఎన్.పుష్పలత, జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి నాగరాణి, డిసిహెచ్ కృష్ణంరాజు, సెరికల్చర్ అధికారి డి.వాణి పాల్గొన్నారు.

కార్మికుని కుటుంబానికి రూ.10 లక్షలు పరిహారం ఇవ్వాలి

సిఐటియు

ప్రజాశక్తి - ఉంగుటూరు

విధి నిర్వహణలో ఉండగా పని ప్రదేశంలో మృతి చెందిన కార్మికుని కుటుంబానికి చట్టప్రకారం రూ.10 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు సీరా అప్పారావు, కొక్కిరిపాటి వెంకట్రావు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మృతుని కుటుంబాన్ని సిఐటియు బృందం శుక్రవారం పరామర్శించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉంగుటూరుకు చెందిన అడపా వెమ్మారావు (52) అదే గ్రామంలోని సెవెన్ హిల్స్ పౌల్ట్రీస్‌లో రెండేళ్లుగా సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారన్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారని తెలిపారు. అతి తక్కువ వేతనానికి రాత్రీ పగలు అనే తేడా లేకుండా పని చేస్తున్నాడన్నారు. శుక్రవారం ఉదయం ఆరు గంటల సమయంలో విధి నిర్వహణలో ఉండగా గురక వచ్చి అక్కడికక్కడే వెమ్మారావు మృతి చెందారని తెలిపారు. పని ప్రదేశంలో చనిపోతే యజమానులే బాధ్యత వహించాలని చట్టం చెబుతుందని, చట్టప్రకారం నష్టపరిహారం ఇవ్వాల్సి ఉండగా చట్టవిరుద్ధంగా కేవలం రూ.50 వేలు ఇచ్చి చేతులు దులుపుకోవడం అన్యాయమన్నారు. మృతుని కుటుంబానికి రూ.10 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.



ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులు, నేతలు

కృష్ణ కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారమివ్వాలి

సిఐటియు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని చిగురుకోటలోని మీనా ఎంటర్‌ప్రైజెస్ ఫ్యాక్టరీలో గురువారం ప్రమాదానికి గురై మృతి చెందిన సారిపల్లి కృష్ణ (32) కుటుంబానికి న్యాయం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ డిమాండ్ చేశారు. మృతుడు కృష్ణ మృతదేహాన్ని శుక్రవారం గుడివాడ ప్రభుత్వాసుపత్రి వద్ద సిఐటియు కృష్ణా జిల్లా కార్యదర్శి ఆర్‌సిపి.రెడ్డి, ఏలూరు జిల్లా నాయకులు జె.గోపితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మృతునికి భార్య, ఎనిమిది నెలల కుమారుడు ఉన్నారన్నారు. ఫ్యాక్టరీ ఆవరణలో డ్యూటీలో ఉండగా సారేపల్లి కృష్ణ విద్యుదాఘాతానికి గురవ్వగా యాజమాన్యం కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా రాత్రి తొమ్మిది గంటల వరకు స్థానిక ఆర్‌ఎంపి వైద్యుల చుట్టూ తిప్పడంతో సరైన వైద్యం అందక కృష్ణ మృతి చెందాడని ఆవేదన వ్యక్తం చేశారు. మీనా ఎంటర్‌ప్రైజెస్ ఫ్యాక్టరీలో ఫస్ట్‌ఎయిడ్ సౌకర్యంగాని, అంబులెన్స్‌గాని లేవని, కనీస సౌకర్యాలు కూడా కల్పించ లేదని విమర్శించారు. ప్రమాదం జరిగిన తర్వాత కూడా మెరుగైన వైద్యం అందించకపోవడంతో కార్మికుడు కృష్ణ ప్రాణాలు కోల్పోయాడని తెలిపారు. ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్, కార్మిక శాఖాధికారులు తక్షణమే స్పందించి మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గతంలో పోరస్ ఫ్యాక్టరీ ప్రమాదంలో ఇచ్చిన విధంగా రూ.50 లక్షలు నష్టపరిహారం మృతుని కుటుంబానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు.



ఆత్మీయ సమ్మేళనంలో నాయకులు

నాయీబ్రాహ్మణులు సమస్యలపై ఐక్యంగా పోరాడాలి

జంగారెడ్డిగూడెం: నాయీ బ్రాహ్మణులు ఐక్యంగా సమస్యలపై పోరాడాలని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పెర్ల నాగరాజు అన్నారు. శుక్రవారం లక్కవరంలోని కళ్యాణ మండపంలో నాయీ బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం లక్కవరం నాయీ బ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్షులు నూజేటి కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు మాట్లాడుతూ దేవాలయ పాలకవర్గంలో డైరెక్టర్ పదవులు, ఫెడరేషన్ కార్పొరేషన్లలో బార్బర్ షాపులకు ప్రభుత్వం 150 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను నాయీబ్రాహ్మణులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు చిప్పాడ నరసింహారావు, ఏలూరు జిల్లా నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు కొప్పాక వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి కొప్పాక సత్యనారాయణ, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అయినపర్తి ఉషారాణి, సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం : డిఎన్ఆర్

కలిదిండి: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం పనిచేస్తుందని కైకలూరు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు(డిఎన్ఆర్) అన్నారు. మండలంలోని పడమటిపాలెంలో రూ.13.40 లక్షలు, గ్రామ పంచాయతీ నిధులు రూ.7.70 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, జగనన్న కాలనీలో వీధిదీపాల విద్యుత్ లైనును ఆయన ప్రారంభించారు. సర్పంచి సానా మీనా సరస్వతి, క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, వైసిపి మండల అధ్యక్షులు తిరుమాని రమేష్, ఎంపిటిసి టెక్కెం శ్యామ్, ఎఎంసి ఉపాధ్యక్షులు పాము రవికుమార్, ఎఎంసి మాజీ ఛైర్మన్ నీలపాల వెంకటేశ్వరరావు, చిట్టూరి బుజ్జి, సానా రాము, పడవల శ్రీను, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ నాగబాబు, సంబంధిత శాఖాధికారులు పాల్గొన్నారు.

కామాంధుడు అరెస్టు

ఏలూరు స్పోర్ట్స్: ఇద్దరు బాలికలపై అత్యాచారానికి పాల్పడి, వారిని గర్భవతులను చేసిన కామాంధుణ్ని పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. పెదపాడు మండలంలో జరిగిన ఈ అమానవీయ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి విశాఖపట్నానికి చెందిన చెందిన పుట్ట సతీష్‌పవన్‌కుమార్ పదేళ్ల క్రితం పెదపాడు మండలం సీతాపురానికి పొట్టకూటి కోసం వచ్చాడు. అతనికి వరుసకు మరదలైన విజయలక్ష్మికి గతంలో వివాహమైంది. అయితే ఆమె భర్త 2017లో మృతి చెందాడు. అనంతరం కొన్నేళ్ల తర్వాత విజయలక్ష్మిని సతీష్ వివాహం చేసుకున్నాడు. అప్పటికే ఆమెకు ఇద్దరు కుమార్తెలున్నారు. పెళ్లి జరిగే సమయానికి వారు ఎనిమిది, ఏడు తరగతులు చదువుతున్నారు. అప్పటి వరకూ తెలియని పిల్లల విషయం తెలుసుకున్న సతీష్ వారిపై కన్నేశాడు. దీంతో వారిని ఇంటికి తీసుకురావాలని ఆమెతో తరచూ గొడవపడేవాడు. తీవ్రంగా హింసించేవాడు. దీంతో ఇంటికి తీసుకొచ్చిన వారిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. మొదటి కుమార్తె గర్భం దాల్చి ఆడబిడ్డను ప్రసవించింది. రెండో కుమార్తెతోనూ అతను శారీరక సంబంధం పెట్టుకుని గర్భవతిని చేశాడు. ఈ తరుణంలో అతని బాధలు భరించలేక చిన్న కుమార్తె తన మేనమామకు విషయం చెప్పింది. వెంటనే ఆయన ఏలూరు దిశా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అతన్ని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

అన్నదాతను విస్మరిస్తే ఆహార సంక్షోభం

మోడీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలి

మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలి

సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) జిల్లా సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అన్నదాతలను విస్మరిస్తే ఆహార సంక్షోభం తప్పదని, ఇప్పటికైనా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) జిల్లా సమావేశం డిమాండ్ చేసింది. ఈ నెల 21న ఏలూరులో నిర్వహిస్తున్న జిల్లా సదస్సును, 30న విజయవాడలో రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సమావేశం పిలుపునిచ్చింది. స్థానిక ఐఎఫ్‌టియు జిల్లా కార్యాలయంలో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) జిల్లా సమావేశాన్ని ఎఐకెఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పి.శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో వివిధ రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పాల్గొని రైతాంగ సమస్యలపై చర్చించి కార్యాచరణ కార్యక్రమాలు రూపొందించారు.



అభివాదం చేస్తున్న నాయకులు

సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి ధర్ముల సురేష్, అఖిల భారత ప్రగతిశీల రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌కె.గౌస్, బికెఎంయు జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, రైతుకూలీ సంఘం (ఎపి) జిల్లా కార్యదర్శి ఎస్‌కె.భాషా, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు, ఎపి కౌలురైతుల సంఘం జిల్లా కన్వీనర్ కె.అప్పారావు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సిరికొండ రామారావు, ఎఐకెఎంఎస్ జిల్లా నేత వెట్టి సుబ్బన్న, అఖిలభారత ప్రగతిశీల రైతుసంఘం జిల్లా అధ్యక్షులు గెడ్డాల ముత్యాలరావు మాట్లాడారు. ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా మోడీ ప్రభుత్వం లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసగించిందని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధరలు ప్రకటించి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కేరళ తరహాలో రుణ విమోచన చట్టం తీసుకొచ్చి రైతులను ఆదుకుని ఆత్మహత్యలను నివారించాలని కోరారు. కేంద్ర విద్యుత్ సవరణ బిల్లు నుండి వ్యవసాయాన్ని మినహాయించి వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించే విధానానికి స్వస్తి పలకాలన్నారు. ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరారు. కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయాన్ని, అన్నదాతలను ప్రభుత్వాలు విస్మరిస్తే దేశంలో ఆహార సంక్షోభం తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు.

21న ఏలూరులో ఎస్‌కెఎం జిల్లా సదస్సు

ఈ నెల 21న ఏలూరులోని కొత్త బస్టాండ్ సమీపంలోని సిఐటియు జిల్లా కార్యాలయ హాలులో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) జిల్లా సదస్సు నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఈ సదస్సులో వివిధ రైతు, వ్యవసాయ కార్మిక, కార్మిక సంఘాల ప్రతినిధులు, రైతాంగం పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సమావేశం విజ్ఞప్తి చేసింది.

అసైన్డ్ భూచట్ట సవరణ వెనక్కి తీసుకోవాలి : వ్యకాస

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అసైన్డ్ భూ చట్ట సవరణను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల కార్యదర్శి అందుగులప్రభాకర్‌రావు అధ్యక్షత వహించారు. జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించడం వల్ల భూస్వాములకు పెత్తందారులకు మాత్రమే ప్రయోజనం జరుగుతుందన్నారు. ఇది భూస్వాములకు లబ్ధి చేకూర్చే కుట్రేనని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 1974 సంవత్సరానికి ముందు పేదలకు భూములు పంచాలని వీరోచిత పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. దీంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ల్యాండ్ సీలింగ్ చట్టం తెచ్చి పేదలకు భూ పంపిణీ చేసిందన్నారు. కానీ నేటికీ ఆ భూములు భూస్వాములు చేతుల్లో ఉన్నాయని తెలిపారు. పేదలకు పంపిణీ చేసిన కొద్దిపాటి భూములకు నేడు ఈ ప్రభుత్వం ఈ చట్ట సవరణ ద్వారా మంగళంపాడే కార్యక్రమం చేస్తుందని ప్రభుత్వంపై మండిపడ్డారు. మండలంలోని పంగిడిగూడెం, గురవాయిగూడెం, కేతవరం, నాగుల గూడెం, చక్రదేవరపల్లి, లక్కవరం, ఎ.పోలవరం, పట్టెన్నపాలెం తదితర గ్రామాల్లో జంగారెడ్డిగూడెం పట్టణంలో వేలాది ఎకరాల ల్యాండ్ సీలింగ్ భూములు భూస్వాముల చేతుల్లో ఉన్నాయని తెలిపారు. ఆ భూములు పేదలకు పంచాలని పోరాటాలు నిర్వహిస్తుంటే భూస్వాములు, ప్రభుత్వం కుమ్మక్కై పేదలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని వాపోయారు. పంగిడిగూడెంలో ల్యాండ్ సీలింగ్ భూములు చిన్నం రాజమన్నార్ కుటుంబీకుల వద్ద అధికార పార్టీ నాయకుల స్వాధీనంలో 300 ఎకరాలను ఆక్రమించుకున్నారని తెలిపారు. ఆ భూములు పేదలకు పంచాలని కోరితే భూస్వాములు, అధికారులు కుమ్మక్కై తప్పుడు కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని తెలిపారు. చట్టసవరణ విరమించుకుని, భూస్వాములు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే మండలంలోని పేదలందరినీ ఐక్యం చేసి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భూ పంపిణీ చేసేవరకూ ఉద్యమాలు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో యాగంటి సీత, జోడి సూర్యచంద్రరావు, ఎం.ఆనందరావు, కె.సుబ్బారావు, నిట్టా నాగరాజు, లక్ష్మీనారాయణ, బి.వెంకన్న పాల్గొన్నారు.



అల్లూరి చిత్రపటాలు అందిస్తున్న కుమార్

మహనీయుల ఆశయాలు ఆదర్శం

ప్రజాశక్తి - నిడమర్రు

మహనీయుల ఆశయాలను విద్యార్థులు ముందుకు తీసుకెళ్లాలని ప్రముఖ రచయిత కూనపరాజు కుమార్ అన్నారు. 'మహనీయుల ప్రచార కమిటీ' ఆధ్వర్యంలో విద్యాలయాలకు అల్లూరి సీతారామరాజు చిత్రపటాలను అందించే కార్యక్రమాన్ని నిడమర్రు హైస్కూల్లో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయరాలు బి.రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన విద్యార్థుల, ఉపాధ్యాయుల సభలో కూనపరాజు మాట్లాడారు. గణపవరానికి చెందిన శ్రీలక్ష్మి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత సూరెడ్డి శ్రీనివాసరావు సౌజన్యంతో ఈ చిత్రపటాలను అందిస్తున్నామన్నారు. అల్లూరి జీవిత చరిత్రను పరిశీలిస్తే ఆయన గొప్ప త్యాగం కనిపిస్తుందన్నారు. 40 ఏళ్ల క్రితం తాను అల్లూరి జీవిత చరిత్ర పుస్తకం రాయడం కోసం ప్రయత్నిస్తే ఎన్నో గొప్ప విషయాలు తెలిశాయన్నారు. గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ జిల్లాలో వివిధ మండలాల్లో విద్యార్థులకు మహనీయుల జీవిత విశేషాలు తెలియజేసేందుకు మహనీయుల ఆశయాల ప్రచార కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహనీయుల వివరాలు, ఫొటోలతో ముద్రిస్తున్న క్యాలెండర్‌ను హెడ్‌మాస్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, మానవత స్వచ్ఛంద సంస్థ జిల్లా పూర్వపు అధ్యక్షులు సాగిరాజు జానకీరామరాజు, గణపవరానికి చెందిన శ్రీలక్ష్మి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత సూర్రెడ్డి శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి నారపల్లి రమణారావు, కళ్యాణ్, మైలవరపు లాలయ్య, ఉపాధ్యాయులు డి.అప్పారావు, ఎస్.శ్రీనివాసరావు, ఎం.ప్రసాద్, జి.లక్ష్మీనారాయణ, మానవత సంస్థ జిల్లా నాయకులు సాగిరాజు జానకీరామరాజు పాల్గొన్నారు.

అనంతరం స్కూల్‌కు అల్లూరి చిత్ర పటం, జీవిత చరిత్ర పుస్తకాలు-10, నిడమర్రుకు చెందిన ప్రముఖ హాస్య నటుడు ఎంఎస్.నారాయణ జీవిత చరిత్ర పుస్తకాలు-3 అందజేశారు.



ఇరువురితో మాట్లాడుతున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు

పి.అంకంపాలెంలో మళ్లీ భూవివాదం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని పి.అంకంపాలెం పంచాయతీ పరిధిలోని 200 ఎకరాల భూ వివాదం శుక్రవారం మరోసారి ఘర్షణకు దారితీసింది. నిర్వాసితులకు, మడకంవారిగూడెంలోని కొంతమంది గిరిజనులకు రెండేళ్లుగా ఇక్కడ వివాదం జరుగుతూనే ఉంది. ఈ సమస్యను పరిష్కరించడంతో స్థానిక రెవెన్యూ అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం భూముల్లోకి స్థానిక గిరిజనులు కొంతమంది ట్రాక్టర్లను తీసుకెళ్లి దున్నేందుకు ప్రయత్నించారు. దీంతో స్థానిక నిర్వాసితులు ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరుగ్రూపుల మధ్య వివాదం తలెత్తింది. కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న తహశీల్దార్ సుందర్ సింగ్, ఎస్ఐ చంద్రశేఖర్ ఘటనా స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేశారు. తహశీల్దర్ సుందర్ సింగ్ ఇరువురి వద్ద ఉన్న భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో ఘర్షణ సర్దుమణిగింది.

అవినీతి ఊబిలో తణుకు మంత్రి

సిపిఎస్ రద్దుపై మాటమార్చిన జగన్ - తణుకు సభలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి - భీమవరం, తణుకు రూరల్


తణుకులో మంత్రి భారీ అవినీతికి పాల్పడుతున్నారని, సమస్యలు చెప్పుకోబోయిన రైతులను 'ఎర్రి..' అని సంబోధించి అవమానించడంలో ముందున్నారని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విమర్శించారు. ఈ నెల 9న ఏలూరు జిల్లాలో ప్రారంభమైన వారాహి విజయయాత్ర రెండో దశ పశ్చిమగోదావరి జిల్లా తణుకులో శుక్రవారం రాత్రి ముగిసింది. ఈ సందర్భంగా పట్టణంలోని పైడిపర్రు సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ ప్రసంగించారు. వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే 72 మంది భవన నిర్మాణ కార్మికుల ఉసురు తీసిందన్నారు. సుమారు రూ.900 కోట్లు భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన సంక్షేమనిధిని దోచేసిందని విమర్శించారు. ఇంటి పన్ను రూ.ఆరొందలు పెంచారని, చెత్త పన్ను రూ.వంద వేశారని, నిత్యావసరాల ధరలు గతంతో పోలిస్తే ఆకాశాన్నంటాయని విమర్శించారు. మద్యపాన నిషేధం అని చెప్పి రూ.30 వేల కోట్లు దోచేశారన్నారు. గత ప్రభుత్వ హయాంలో లక్షా 60 వేల బెల్టుషాపులుంటే ప్రస్తుతం మూడు లక్షల బెల్టు షాపులు నడుస్తున్నాయని ఆరోపించారు. దీనివల్ల 52 వేల మంది మహిళలపై మద్యం మత్తులో దాడులు జరిగాయన్నారు. దీనిపై మహిళా కమిషన్, మహిళా మంత్రులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వలంటీర్లు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నారని, తనకు వారంటే కోపం లేదని అన్నారు. తణుకులో మంత్రి ఇళ్ల స్థలాల పూడిక పేరుతో సుమారు రూ.55 కోట్లు దోచేశారన్నారు. టిడిఆర్ బాండ్ల పేరుతో మరో రూ.309 కోట్లు కాజేశారని ఆరోపించారు. దీనిపై ఎసిబి, సిఐడి విచారణ పేరుతో మున్సిపల్ కమిషనర్‌ను బలి చేశారని, వెనుక ఉన్న పెద్దలు బాగానే ఉన్నారని అన్నారు. పట్టణంలో డంపింగ్ యార్డు లేదని, ఎక్కడ చెత్త అక్కడే ఉన్నా ఈ చెత్త ప్రభుత్వం చెత్త పన్ను వేస్తుందని విమర్శించారు. ఆర్‌బికెలు కూడా పూర్తిస్థాయిలో లేవన్నారు. 12 గ్రామ సచివాలయాల నిర్మాణం అసంపూర్తిగా వదిలేశారని, కాంట్రాక్టర్లకు డబ్బులివ్వకపోవడమే దీనికి కారణమన్నారు. ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి రూ.30 వేల నుంచి రూ.50 వేలు వసూలు చేశారన్నారు. కనీసం కాల్వ పనులు చేసి రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు కూడా అందించలేకపోతున్నారన్నారు. నిడదవోలు నుంచి తణుకు వరకూ ఉన్న మూడు కాల్వలకు రూ.30 కోట్లు వెచ్చిస్తే రైతులకు మేలు చేకూరుతుందన్నారు. మద్దతు ధర కోరిన అడిగిన పాపానికి దువ్వకు చెందిన 24 మంది రైతులపై అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లు ఐదు కిలోలు ధాన్యం, రూ.50 నుంచి రూ.వంద వరకూ అక్రమ వసూళ్లకు పాల్పడ్డారన్నారు. అయినా పట్టించుకున్న నాధుడు లేడన్నారు. తొలుత హోటల్ చిట్టూరి హెరిటేజ్ నుంచి పైడిపర్రు సెంటర్ వరకూ మూడు కిలోమీటర్ల మేర రోడ్‌షో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జనసేన నియోజకవర్గ కన్వీనర్ విడివాడ రామచంద్రరావు, నేతలు పాల్గొన్నారు.


రమేష్‌ను అభినందిస్తున్న నాయకులు

తెలుగుయువత చాట్రాయి అధ్యక్షునిగా రమేష్

ప్రజాశక్తి - చాట్రాయి

తెలుగు యువత మండల అధ్యక్షునిగా మోదుగుమూడి రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు రమేష్‌ను నియమిస్తూ నియామకపత్రాన్ని నూజివీడు పార్టీ కార్యాలయంలో శుక్రవారం అందించారు. ఇప్పటివరకూ తెలుగు యువత మండల అధ్యక్షునిగా ఉన్న బొంతు సతీష్‌ను బాధ్యతల నుంచి తప్పిస్తూ తెలుగుయువత జిల్లా అధ్యక్షులు రెడ్డి సూర్యచంద్రరావు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మరిడి వెంకటేశ్వరరావు, చీకటి చెన్నారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

రూ.40 లక్షలతో ముదినేపల్లిలో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

రూ.40 లక్షలతో ముదినేపల్లిలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. స్థానిక గురజ రోడ్డులోని స్పామ్ ఐటిఐ రోడ్డులో గడపగడపకూ మనప్రభుత్వంలో భాగంగా రూ.ఐదు లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఎంఎల్ఎ ప్రారంభించారు. అనంతరం ఐటిఐ కళాశాలలో రూ.25 లక్షలతో కొత్తగా నిర్మించిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఆర్.సత్యనారాయణ, గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ, ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ కె.సత్యనారాయణ, గంటా సంధ్య, నిమ్మగడ్డ భిక్షాలు, కె.వేణు, వి.పండు, ఈడే ఉమ, కె.నాని పాల్గొన్నారు.


విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న దాతలు

దాతల సహకారం అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం అందజేస్తున్న సహాయసహకారాలకు తోడు, పాఠశాలలో ఇతర సౌకర్యాల కల్పనకు దాతలు ముందుకురావడం అభినందనీయమని ఎంఎం.పురం ఎంపిపి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.నిర్మలకుమారి తెలిపారు. స్థానికులు, న్యాయవాది పల్లా త్రినాధరావు గతంలో ఉపాధ్యాయునిగా పని చేసిన తనతండ్రి ఆదినారాయణ జ్ఞాపకార్థం పాఠశాలకు రికార్డు భద్రపరుచుకునేందుకు రూ.25 వేల విలువ గల బీరువాను అందజేశారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. వీటిని శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయరాలికి అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు వెజ్జు అన్నవరం, పాఠశాల కమిటీ సభ్యులు ఎస్.భాష, వి.సూర్యప్రకాష్, ఎం.బాలాజీ, ఉపాధ్యాయులు మండే సుధాకర్ పాల్గొన్నారు.


డెంగీపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని రావిచర్లలో మలేరియా సబ్‌యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం డెంగీ నివారణ మహోత్సవాలలో భాగంగా గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి యలమంద మాట్లాడుతూ గ్రామస్తులు ప్రతీ శుక్రవారం తమ పరిసరాలను శుభ్రం చేసుకుని డ్రై డే పాటించాలన్నారు. ప్లాస్టిక్ గ్లాసులు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, ఉపయోగములో లేని నీటి తొట్టెల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాన్నారు.

నేరాలు - ఘోరాలు

అనారోగ్యంతో ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతి

ప్రజాశక్తి - పోలవరం

చేగొండపల్లి పునరవాసగ్రామ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థి ఈసం మహేంద్ర(12) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. రెండు రోజులుగా అనారోగ్యంతో ఉన్న మహేంద్రను హాస్టల్ వార్డెన్ ఎల్లండిపేట ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స అందించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ తరుణంలో గురువారం రాత్రి 11 గంటల సమయంలో విద్యార్థి ఆరోగ్య పరిస్థితి విషమంగా మారడంతో వైద్యం కోసం పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రానికి తరలించామని, వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారని విద్యార్థి తండ్రి ఈసం రామారావు తెలిపారు. ఐటిడిఎ అధికారుల పర్యవేక్షణా లోపం వల్లే గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు మరణిస్తున్నారని పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు బి.వినోద్ విమర్శించారు. అనంతరం విద్యార్థి కుటుంబ సభ్యులను పిడిఎస్‌యు నాయకులు పరామర్శించారు.

దాడిలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని మీర్జాపురంలో ఇంటి దారి విషయమై ఇరుగ్రూపుల మధ్య ఇటీవల జరిగిన ఘర్షణలో గాయపడిన వ్యక్తి పరిస్థితి విషమించి శుక్రవారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గత నెల నాలుగో తేదీన గ్రామానికి చెందిన బత్తిన శ్రీనివాసరావు, బాబూరావు(51) కుటుంబాల మధ్య ఇంటిదారి విషయంలో ఘర్షణ జరిగింది. దీనిపై అప్పట్లో రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం గ్రామ పెద్దల సమక్షంలో ఇరువురినీ పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. మరుసటి రోజు మరోసారి వివాదం తలెత్తడంతో శ్రీనివాసరావు, బాబూరావును నెట్టడంతో కింద పడిపోయాడు. ఆ సమయంలో పక్కన రాయి అతని గుండెకు బలంగా తగిలింది. దీంతో అతను అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తొలుత నూజివీడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి బాబూరావు మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

'జగనన్న సురక్ష'తో అర్హులందరికీ పథకాలు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ప్రతి అర్హునికీ సంక్షేమ పథకాలు అందేలా చూడటమే జగనన్న సురక్ష కార్యక్రమ లక్ష్యమని గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని జాజులకుంట సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఉంగుటూరు : ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు ఆధ్వర్యాన జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం నారాయణపురంలో నిర్వహించారు. వివిధ ధృవపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సభలో పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం కొబ్బరి మొక్కలను గ్రామంలో పలుచోట్ల నాటారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రమణ, తహశీల్దార్ ఎవి.రమణారావు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఆంజనేయులు, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు కొరిపల్లి జయలక్ష్మి, ఎఎంసి మాజీ ఛైర్మన్ మరడ రమావతి, వైసిపి జిల్లా కార్యదర్శి పుప్పాల గోపీ, మండల కన్వీనర్ మంగారావు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, అధికార పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

ముదినేపల్లి : జగనన్న సురక్షతో ప్రజలకు సత్వర సేవలందిస్తున్నామని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. ముదినేపల్లి సచివాలయం-2 వద్ద శుక్రవారం సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష సభలో ఆయన మాట్లాడారు. అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, గతంలో ఏ ప్రభుత్వమూ అమలు చేయని అనేక సంక్షేమ పథకాలను జగనన్న ప్రభుత్వం ప్రవేశపెట్టి ప్రజల వద్దకు తీసుకెళ్తున్నారన్నారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, గంటా సంధ్య, వైస్‌ఎంపిపి రాచూరి రాధా, పార్టీ మండల కన్వీనర్ ఎం.ఏసుబాబు, ఎంపిటిసిలు జంపాన కోటయ్య, మరీదు నాగయ్య, పార్టీ నాయకులు నిమ్మగడ్డ భిక్షాలు, ఈడే వెంకటేశ్వరరావు, బేతపూడి వెంకటరమణ, గంటా కోటేశ్వరరావు, శీలం రామకృష్ణ, ఎంపిడిఒ పి.మల్లీశ్వరి విద్యుత్ శాఖ ఎఇ రవికుమార్ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని మండల ప్రత్యేక అధికారి పివిఎస్.నాయుడు తెలిపారు. శుక్రవారం వంకవారిగూడెం పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం పరిసరాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.పోసమ్మ, తహశీల్దార్


ద్వారకాతిరుమల మండలంలో..

సుందర్‌సింగ్, ఎంపిడిఒ కృష్ణప్రసాద్, సర్పంచి కుంజా పార్వతి, ఎంపిటిసిలు సున్నం సురేష్, వెంకటలక్ష్మి, సీనియర్ నాయకులు కుంజ రాముడు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: ప్రజల సమస్యలు అధికారులు దృష్టికి తీసుకువచ్చి వాటిని తక్షణం పరిష్కరించడమే జగనన్న సురక్ష లక్ష్యమని ఎంపిపి కొదమ జ్యోతి అన్నారు. శుక్రవారం మండలంలోని పేరంపేటలో జగనన్న సురక్ష సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి జ్యోతి, జెడ్‌పిటిసి సభ్యులు పోల్నాటి బాబ్జీ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ముందుగా వివిధ ధృవపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పేరంపేట నుంచి జంగారెడ్డిగూడెం రహదారి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరారన్నారు. త్వరలోనే మరమ్మతులు చేపడతామని చెప్పారు. జెడ్‌పిటిసి సభ్యులు వెంకటాద్రిపురం వెళ్లే రోడ్డు గురించి కూడా ప్రజలు అడిగారని అది కూడా ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదు : టిడిపి

ఈ తరుణంలో టిడిపి నాయకులు రామకృష్ణారెడ్డి వేదిక వద్దకు చేరుకుని గ్రామంలోని సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని నిలదీశారు. ఈ క్రమంలో సభలో కొద్దిసేపు ఘర్షణ వాతావరణం ఏర్పడింది. వెంటనే పోలీసులు చేరుకుని ఘర్షణ పడుతున్న వారిని చెదరగొట్టారు. ఈ కార్యక్రమంలో పేరంపేట సర్పంచి కంకిపాటి కుమారి, ఎంపిటిసి ఎర్ల విజయశాంతి, పంగిడిగూడెం సర్పంచి కోట శ్రీనివాసరావు, పట్టెన్నవారిగూడెం సర్పంచి పార్థసారధి, వైసిపి మండల అధ్యక్షులు వామిశెట్టి హరిబాబు పాల్గొన్నారు.

నూజివీడురూరల్: మండలంలోని జంగంగూడెంలో మండల ప్రత్యేకాధికారి ఎస్.రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పొట్లూరి అంజనాదేవి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.


ముసునూరు : ఆర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష ముఖ్యఉద్దేశమని నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్‌అప్పారావు అన్నారు. మండలంలోని వేల్పుచర్ల సచివాలయంలో ఎంపిడిఒ జి.రాణీ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ప్రతాప్, వైసిపి మండల అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, వైస్ ఎంపిపి-2 పాముల గంగధరరావు, తహశీల్దార్ దాసరి సుధ, సర్పంచులు, ఎంపిటిసిలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


చింతలపూడి : అర్హత ఉండి పథకాలు పొందలేని వారికి జగనన్న సురక్ష ద్వారా అందిస్తున్నామని ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. మండలంలోని యర్రగుంటపల్లి-2 సచివాలయ వద్ద జగనన్న సురక్షలో ఎంఎల్ఎ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు మోలుగుమాటి నీరజాసుధాకర్, తహశీల్దార్ కృష్ణజ్యోతి, ఇఒపిఆర్‌డి విక్టర్ ప్రసాద్, ప్రముఖ వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అనంతరం మండలంలోని సీతానగరం పంచాయతీ బాలవారిగూడెంలో గడప-గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎంఎల్ఎ నిర్వహించారు.

పోలవరం : మండలంలోని పాతపట్టిసం పంచాయతీ కార్యాలయంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐటిడిఎ పిఒ జివి.సత్యనారాయణ, ఎంపిపిల సంఘం జిల్లా అధ్యక్షులు, పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.శ్రీను, తహశీల్దార్ బి.సుమతి, జెడ్‌పిటిసి సభ్యులు కులం హేమ కుమారి పాల్గొన్నారు.


జీలుగుమిల్లి మండలంలో..


జంగారెడ్డిగూడెంలో..


ముసునూరు మండలంలో..

ముదినేపల్లి ఉత్తమ రైతుగా సుబ్బారావు

ప్రజాశక్తి - ముదినేపల్లి

గురజ గ్రామానికి చెందిన వైసిపి నాయకులు పుట్టి సుబ్బారావును మండల వ్యవసాయ శాఖ మండల ఉత్తమ రైతుగా ఎంపిక చేసింది. ఇటీవల రైతు దినోత్సవం సందర్భంగా కృష్ణాజిల్లా సహకార కేంద్రబ్యాంక్ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ రైతుగా ఎంపికైన సుబ్బారావుకు బ్యాంక్ తరపున రూ.10 వేలు నగదు బహుమతి, మెమెంటో, ప్రశంసాపత్రం అందించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో ముదినేపల్లిలో పుబ్బారావుకు ఎంపిపి సత్యనారాయణ, పార్టీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు.

మహిళా శక్తి సమావేశానికి తరలిన తెలుగు మహిళలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు టిడిపి కార్యాలయం నుండి తెలుగు మహిళలు టిడిపి కేంద్ర కార్యాలయంలో జరిగే మహిళా శక్తి సమావేశానికి శుక్రవారం పయనమయ్యారు. నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముద్దబోయిన వెంకటేశ్వరరావు నేతృత్వంలో నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు వై.ఉషారాణి ఆధ్వర్యంలో ప్లకార్డులతో తెలుగు మహిళలు బయలుదేరారు. ఈ సందర్భంగా ముద్దరబోయిన మాట్లాడుతూ మహిళలకు తెలుగుదేశం ప్రభుత్వం అధికప్రాధాన్యతిస్తుందన్నారు.

17న సహకార ఉద్యోగుల చలో విజయవాడ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

సహకార ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17వ తేదీన విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని ఎపి పిఎసిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీలం నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

25న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభ

ఏలూరు అర్బన్: వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) జిల్లా ప్రథమ మహాసభ ఈనెల 25వ తేదీన జంగారెడ్డిగూడెంలో నిర్వహిస్తున్నట్లు బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బికెఎంయు రెండుగా విడిపోవడం వల్ల ఏలూరు జిల్లా మహాసభ జంగారెడ్డిగూడెంలోని ఆలపాటి గంగాభవాని కళ్యాణ మండపంలో జరుగుతుందన్నారు. 25వ తేదీ ఉదయం 10 గంటలకు వందలాది మంది గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికులతో ప్రదర్శన, 11 గంటలకు కళ్యాణ మండపంలో మహాసభ జరుగుతుందని, ఈ మహాసభకు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ శాసనమండలి సభ్యులు జల్లి విల్సన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని తెలిపారు. సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బోడ వజ్రం, జిల్లా అధ్యక్షులు మామిళ్లపల్లి వసంతరావు, వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఐ జిల్లా నాయకులు పాల్గొంటారని వెంకటేశ్వరరావు తెలిపారు.

పలుగ్రామాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం

బుట్టాయగూడెం : మండలంలోని అలివేరు సచివాలయ పరిధిలోని అలివేరు, లంకపాకల, నిమ్మలపాడు, డోలుగండి, రేపల్లె, రేకులపాడు, ఎర్రాయిగూడెం, చింతకొండ, గొట్టాలరేవు, పుసుగొంది, రెడ్డిబొడ్డేరు, గ్రామాల్లో ఎంఎల్ఎ తెల్లం బాలరాజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం శాంతి, జెడ్‌పిటిసి సభ్యులు మొడియం రామతులసి, వైస్ ఎంపిపి గుగ్గులోతు మోహన్‌రావు, కుక్కల వరలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు ఆరేటి సత్యనారాయణ, స్థానిక సర్పంచి కారం లక్ష్మి, ఎంపిటిసి కొవ్వాసి గోవిందరాజు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పథకాలను కౌలురైతులు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భీమడోలు

ప్రభుత్వం కౌలురైతుల అభ్యున్నతికి ప్రత్యేకించిన పథకాల సేవలను వినియోగించుకోవాలని భీమడోలు వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పసుపులేటి సత్యనారాయణ కోరారు. ఆయన అధ్యక్షతన స్థానిక రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులు పి.ఉషా రాజకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ పంట సాగు హక్కు పత్రాలను తీసుకున్న రైతులు రైతు భరోసా కేంద్రాల వద్ద తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. వీరిలో ఎస్‌సి, ఎస్‌టి, ఇతర సామాజిక తరగతులకు చెందిన రైతులకు రైతు భరోసా పథకం సేవలు అందుతాయన్నారు. భూ యజమాని తన భూమిపై పంట రుణం తీసుకోకుంటే దానిని సాగు చేసే అధీకృత కౌలు రైతుకు పంట రుణాలు మంజూరవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ద్వారకాతిరుమల ఉద్యానవన అధికారి దేవానందరావు మాట్లాడుతూ తన కార్యాలయ పరిధిలో గతంతో పోల్చుకుంటే పామాయిల్ సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. పామాయిల్ రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం దేశీయరకం సాగు చేసే రైతులకు హెక్టారుకు రూ.20 వేలు, దిగుమతి చేసుకున్న పామాయిల్ మొక్కలతో సాగు చేసే రైతుకు రూ.29 వేలు వంతున రాయితీ అందజేస్తుందన్నారు. ఇదేవిధంగా ఆ రైతుకు ప్రతి సంవత్సరం నిర్వహణకు, ఎరువుల ఖర్చుకు రూ.5250, అంతర పంటలు సాగు చేసే రైతులకు ప్రోత్సాహకంగా రూ.5250 వంతున వరుసగా నాలుగేళ్ల పాటు రాయితీని అందజేస్తుందన్నారు. ఇదేవిధంగా ఆరు సంవత్సరాలు వయసు దాటిన పామాయిల్ తోటలో అంతర పంటగా కోకో సాగు చేసే రైతులకు మూడు సంవత్సరాల వ్యవధిలో రూ.20 వేల రాయితీ అందుతుందన్నారు. కొబ్బరి, అరటి, బొప్పాయి సాగు చేసే రైతులకు కూడా ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందజేస్తుందని తెలిపారు. పొలసానిపల్లికి చెందిన కౌలు రైతు, కమిటీ సభ్యులు కిలపర్తి రుక్మాంధరావు చెరువుల కింద వర్షాధారంగా వరి సాగు చేసే రైతులు నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రకృతి కరుణించని కారణంగా వారు పంట నష్టపోయే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వారికి పంట నష్టపరిహారం అందించాలని కోరారు. లేదా రాయితీపై ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునేందుకు సహాయ సహకారాలను అందజేయాలని కోరారు. వ్యవసాయ సలహా మండలి సమావేశానికి వ్యవసాయం దాని అనుబంధ శాఖల అధికారులు లేదా వారి ప్రతినిధులు హాజరుకాకపోవడం పట్ల సమావేశం అసంతృప్తిని వెలిబుచ్చింది. దీనిని సరిచేయాలని బాధ్యులకు సూచించింది. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ రమ్యశ్రీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ సత్యనారాయణ


మురుగునీటిని పరిశీలిస్తున్న ఆనందబాబు

మురుగుసమస్యకు పరిష్కారం చూపండి

ప్రజాశక్తి - మండవల్లి

మురుగు పోయేలా చర్యలు తీసుకుని వ్యాధుల భారినుండి కాపాడాలని మండల విస్తరణ అధికారి ఆనంద్ బాబును గ్రామస్తులు వేడుకున్నారు. వర్షాకాలం దృష్ట్యా మురుగుపోయేలా చర్యలు తీసుకుని వ్యాధుల బారి నుండి ప్రజలను కాపాడాలని ప్రజాస్వామ్య ఐక్యవేదిక సభ్యులు స్పందనలో విజ్ఞప్తి చేశారు. దీంతో అయన మండవల్లిలో పర్యటించి పరిశీలించారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా తవ్వకాలు చేసి వదిలేసి వెళ్లిపోయారని ఆయన దష్టికి తీసుకువచ్చారు. దీంతో మురుగు పోయేందుకు అవకాశం లేకపోవడంతో జాతీయ రహదారిపై మురుగునీరు నిత్యం నిల్వ ఉంటుందని తెలిపారు. రహదారిపై నుండి వేలంపేట రామాలయానికి వెళ్లే రహదారిపైకి చేరుకుని దుర్వాసన వెదజల్లుతుందని, రాకపోకలు సాగించలేకపోతున్నామని గ్రామస్తులు ఆయన వద్ద వాపోయారు. అనంతరం ఎన్‌హెచ్‌డి సత్యనారాయణతో మాట్లాడి మురుగునీరు పోయేలా చర్యలు చేపట్టాలని కోరారు. మురుగు పోయేలా పూర్తిస్థాయిలో చర్యలు చేపడతామని ఆయన గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, అప్పారావు, కార్యదర్శి పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు